క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

నిడుమోలు(మొవ్వ): మొవ్వ మండలం నిడుమోలు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రగాయాలపాలయ్యాడు. కూచిపూడి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన పోగుల కల్యాణరావు(65) బుధవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న క్రమంలో పామర్రు నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణరావు తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. అంబులెన్సులో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. కాగా బాధితుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ డి. సందీప్ దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు



చినముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం చినముత్తేవిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సిలికానాంధ్ర సంజీవని హాస్పిటల్ వైద్యులు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్య నిపుణులు పి. శ్వేత పాఠశాలలోని 63మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు, పేస్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సాయికుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హనుమ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి టెక్నికల్ ఎక్స్‌పో

గుడివాడటౌన్ : స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 2, 3, 4 తేదీలలో టెక్నికల్ ఎక్స్‌పో, వీకేఆర్ ప్రీమియర్ లీగ్ 2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని గుడివాడ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందవలసిందిగా ఆయన కోరారు.

జీవన్‌జ్యోతి బీమా యోజన ఒక వరం

మండవల్లి: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పేద ప్రజలకు ఒక వరం వంటిదని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామంలో పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన ద్వారా వచ్చిన రూ. 2 లక్షల చెక్‌ను సర్పంచ్ బి శేషగిరిరావు చేతులమీదుగా లబ్ధిదారులు గోరిపర్తి రమాదేవికి బుధవారం అందజేశారు.

ఠంఛన్‌గా పెన్షన్ పంపిణీ

పామర్రు: ఠంచన్‌గా లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేస్తున్నట్లు ఎంపీడీవో వై. రామకృష్ణ బుధవారం తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంతో ఎంతో మంది అవ్వా తాతలు ఆనందాన్ని వక్తం చేస్తున్నారని అన్నారు. మండల పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం 50 శాతం పూర్తి అయ్యిందని అన్నారు. మండలంలో మొత్తం 7,827 పెన్షన్‌లు ఉండగా ఇప్పటి వరకు 3915 మందికి అందించినట్లు పేర్కొన్నారు.

పోలీసులకు టీషర్టులు

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న 100 మంది పోలీసులకు తేజ మొబైల్స్ ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. టీషర్టులను ఆర్యవైశ్య సంఘం యువజన సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజసాయి వెంకట్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు అందించారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



కలిదిండిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ మహమ్మద్ సఫాయితుల్లాల ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 155వ రోజు కలిదిండి సచివాలయం–2 పరిధిలో గురువారం జరిగింది. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు నివాళి అర్పించారు. అనంతరం మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పథకాల రూపంలో లబ్ధిపొందిన కుటుంబాలకు కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ప్రజల నుంచి చక్కటి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలతో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సుదీర్ఘ పాదయాత్రలో అన్ని రంగాల ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పింఛన్లను దశల వారీగా పెంచుతున్నారని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, కలిదిండి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు గద్దె ఆనందకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి, నాయకులు నీలపాల భోగేశ్వరరావు, చెన్నంశెట్టి కోదండరామయ్య, ఫ్రాన్సిస్, చిట్టూరి బుజ్జి, బాబు రావు, చెన్నంశెట్టి సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర స్వామికి వెండి కిరీటం



కిరీటాన్ని అందజేస్తున్న భక్తులు

గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి బుధవారం భక్తులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన భక్తులు పేరి రూపేష్ 360 గ్రాముల వెండి కిరీటాన్ని బహూకరించారన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి కిరీటాన్ని ఆలయ పాలకవర్గ కమిటీ సభ్యులు వి సూర్యనారాయణ సమక్షంలో స్వీకరించడం జరిగిందన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

పెదముత్తేవి(మొవ్వ): వైఎస్సార్ సీపీ పాలనలో నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం నిడుమోలు గ్రామాల్లో నాడు నేడు ఫేజ్ 2 పనులకు బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. రూ1.55కోట్ల వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రూ.16లక్షలతో పెదముత్తేవిలోని అంగన్‌వాడీ కేంద్రం–1 అభివృద్ధి పనుల శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని, రాష్ట్రంలోని ప్రతి పేదవానికి ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీటీసీ ఉప్పలపాటి జ్యోతి, సర్పంచ్‌లు కొమరగిరి అంజిలి, ఉప్పలపాటి నాగ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సీడీపీవో పి. భానుమతి, వైఎస్సార్‌సీపీ పార్టీ మండలాధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు కృపకు పాత్రులవుదాం



పెదలంక నూతన చర్చి ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): ప్రభు ఏసు కృప సర్వజనులందరిపై ప్రసరించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. కలిదిండి మండలం పెదలంకలో పరిశుద్ధ దేవుని మందిరం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా గురువారం హాజరయ్యారు. హోలీ చర్చ్ దైవజనులు కె.జాన్ మంగాచార్యులు ప్రత్యేక దైవ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలపాల వెంకటేశ్వరరావు, అయినాల రాము, ముద్దం కృష్ణ, తిరుమాని రమేష్, గద్దె ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడ్లవల్లేరు: పేదల సంక్షేమమే సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు అన్నారు. వడ్లమన్నాడు శివారు రెడ్డిపాలెం గ్రామస్తుడు పామర్తి రమేష్ మంగళవారం మృతి చెందాడు. బుధవారం మట్టి ఖర్చుల తక్షణ సాయం కింద రూ.10వేలను మృతుని భార్య రమాదేవికి అందజేశారు. ఆ బాధిత కుటుంబానికి రూ.లక్ష వైఎస్సార్ బీమా మంజూరైనట్లు ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.రాంబాబు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల నిర్ధారణ క్యాంపు

మండవల్లి: కైకలూరు భవిత కేంద్రంలో ఉపకరణాల నిర్ధారణ క్యాంపు గురువారం ఉదయం 9 గంటల నుంచి జరుగుతుందని ఎంఈఓ కె.నరేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భోజన సదుపాయం, రవాణ ఏర్పాటు చేస్తారన్నారు. ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ రెండు జతల కాపీలు, 2 ఫొటోలు తేవాలని తెలిపారు.

విద్యుత్ సబ్సిడీకి ఆధారాలు ఇవ్వండి

కైకలూరు: నియోజకవర్గంలో నాన్ ఆక్వాజోన్ పరిధిలో అర్హులైన ఆక్వా రైతులు విద్యుత్‌సబ్సిడీ కోసం గురువారం మధ్యాహ్నం లోపు స్థానిక గ్రామ మత్స్య సహాయకులు, కైకలూరు ఫిషరీస్ కార్యాలయంలో మత్స్య అభివృద్ధి అధికారి(ఎఫ్‌డీఓ)లను ఆధారాలతో సంప్రదించాలని మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభ బుధవారం చెప్పారు. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల పరిధిలో మొత్తం 34,102 ఎకరాలు ఆక్వాజోన్ పరిధిలోకి చేరాయన్నారు. అదే విధంగా నాలుగు మండలాల్లో 8051.38 ఎకరాలు 10 ఎకరాలు కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయన్నారు. వీటిలో 10 ఎకరాల లోపు విస్తీర్ణంలో అర్హులైన వారు అనర్హుల జాబితాలో ఉంటే పూర్తి ఆధారాలతో మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

పెదపాలపర్రులో పొలంబడి

ముదినేపల్లిరూరల్: మండలంలోని పెదపాలపర్రులో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు డి.రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పాల్గొని రైతులతో మాట్లాడారు. మినుము పైరులో ప్రస్తుత దశలో ఆశించే తెగుళ్లు, పురుగుల గురించి వివరించారు. వీటి నివారణకు ఏ ఏ మందులు వాడాలో సూచించారు. ప్రస్తుతం మినుము పైరులో వేరుకుళ్లు తెగులు గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు ట్రైకోడెర్మావిరిడి, వేపనూనె కలిపి వాడాలని సూచించారు. మినుము సాగుకు సంబంధించి ఇప్పటికే 90 శాతం పైగా ఈక్రాప్ పూర్తిచేశామని మిగిలిన రైతులు స్థానిక ఆర్బీకేల్లో వ్యవసాయసహాయకులను సంప్రదించి ఈక్రాప్ చేయించుకోవాలని కోరారు.

108 వాహనాల్లో ఉద్యోగాలు

గుడివాడటౌన్ : 108 వాహనాల్లో ఉద్యోగాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రశాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌టీ, జీఎన్‌ఎం ఉద్యోగాలకు బీఎస్సీ లైఫ్ సైన్స్, సీబీజెడ్, బీజెడ్‌సీ, బయోటెక్, మైక్రో బయాలజీ, బీ ఫార్మసీ, ఎఫ్‌జెడ్‌సీ, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు సైతం ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 7901240703లో సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

వ్యక్తికి తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ రహదారిపై బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొనటంతో ద్విచక్రవాహనచోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని రేమల్లేకు చెందిన చొటపల్లి రవి వీరవల్లి నుంచి హనుమాన్‌జంక్షన్‌కు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో బైక్‌పై వస్తుండగా, సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో సర్వీస్ రోడ్డులోకి ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో తిరుగుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పామాయిల్ లోడుతో ఉన్న ట్రాక్టర్ వేగంగా ద్విచక్రవాహనదారుడిని ఢీకొనటంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానికులు పిన్నమనేని సిద్దార్థ వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్‌తో పాటుగా డ్రైవర్‌ను వీరవల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరవల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీసీలకు అండగా సీఎం జగన్

కైకలూరు: బీసీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కొనియాడారు. కైకలూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో శ్రీకాంత్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవి పొడిగింపు సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల కరెంటు బిల్లులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తుపాకుల సోమాచారికి 'విశ్వ కర్మ సేవా రత్న' బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.



విశ్వకర్మ సేవారత్న బిరుదును సోమాచారికి అందిస్తున్న కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్

గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మట్టా నాగమణి



మట్టా నాగమణి (ఫైల్)

గుడివాడరూరల్: గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా మట్టా నాగమణి పేరు ఖరారు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) బుధవారం సాక్షికి తెలిపారు. పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో నూతన పాలకవర్గాన్ని త్వరలోనే నియమించనున్నారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ తనను మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే కొడాలి నాని, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డ్ పరిధిలోని రైతులందరికీ మేలు సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు



పామర్రులోని విష్ణాలయంలో భగవద్గీత పారాయణ చేస్తున్న భక్తులు

పామర్రు: మాఘ మాసం శుద్ధ ఏకాదశి బుధవారం పురస్కరించుకుని పలు వైష్ణవ ఆలయాలలో భీష్మ ఏకాదశి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విష్ణాలయంలో స్వామికి విశేషంగా అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలను చేశారు. తదుపరి భక్తులు ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణ 18 అధ్యాయాలను పఠించారు. అనంతరం విష్ణు, లలిత సహస్ర నామాలతో పాటుగా హనుమాన్ ఛాలీసాలను చదివారు. వచ్చిన భక్తులకు నీరాజన మంత్రపుష్పాలను ఇచ్చి స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మండల పరిధి రాపర్ల గ్రామంలో వేంచేసియున్న గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, నిమ్మకూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, పెరిశేపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలలో విశేష పూజలను చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



అంకమ్మతల్లి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రులో వీరఅంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాద్యాల నడుమ విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం ఆది వినయ్‌కుమార్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ప్రతిష్టకు హాజరయ్యారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండలశాఖ అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు బొర్రాశేషుబాబు, లేళ్ళ ఆంజనేయులు, ఈడే పూర్ణచంద్రరావు, దాకరపు శ్రీనివాసరావు, బోయిన రామరాజు, నంగెడ్డ మునియ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



కొత్తపేట ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ పుష్పలత

కైకలూరు: స్థానిక కొత్తపేట ఎంపీయూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత పరిశీలించారు. వండిన పదార్థాలను రుచి చూశారు. మెనూ సంక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా విద్యార్థుల కోసం పౌష్టికాహారమైన మెనూను రూపొందించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న మెనూ ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. నేడు కార్పొరేట్ పాఠశాలలను మించి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

రేపు మసీదు నిర్మాణ పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ముస్లిం పెద్దలు

గుడివాడటౌన్ : స్థానిక దొండపాడు కాలనీలో ఈనెల 3వ తేదీన నిర్మించనున్న ముస్లిం ప్రార్థనా మందిరం నూతన భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు ముస్లిం నాయకులు తెలిపారు. ఈ మేరకు ముస్లిం నాయకులు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆహ్వాన పత్రం అందించి, శంకుస్థాపన చేయవలసిందిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, ఉపాధ్యక్షుడు అలి బేగ్, మసీదు కమిటీ సభ్యులు ఎండీ షఫి, గౌస్, కరీముల్లా పాల్గొన్నారు.

గేదె, దూడను కాపాడిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

కైకలూరు: గేదె, దూడలకు అనుకొని ఆపదొచ్చింది. కైకలూరు పాత పోలీసు క్వార్టర్స్ వద్ద మేస్తున్న మూగజీవాలు తెరిచి ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి గురువారం పడ్డాయి. ముందు దూడ పడగా దానిని అనుసరించి గేదె కూడా ట్యాంక్‌లో కూలబడింది. సమీపంలోని కానిస్టేబుల్ బాలాజీ, హోంగార్డు మాధవ గమనించారు. రక్షించడానికి ప్రయత్నించారు. పైకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ వచ్చిన తర్వాత తాడులతో అతికష్టం మీద గేదె, దూడలను రక్షించారు. మూగజీవాలను రక్షించిన సిబ్బందిని పలువురు అభినందించారు.

గ్రామోత్సవం.. భక్త నీరాజనం

వైభవంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు సాయిమహల్ సెంటరులో అమ్మవారి రథంపై పూలవర్షం కురిపిస్తున్న భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా సాగింది. మెట్టినింటి నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారు ప్రత్యేకంగా తయారుచేసిన రథంపై పట్టణ వీధుల్లో బుధవారం రాత్రి వరకూ ఊరేగారు. దారి పొడవునా భక్తులు అమ్మకు హారతులు ఇచ్చి పసుపునీళ్లు ఓరబోసి, అమ్మ రథంపై పూలవర్షం కురిపించారు. చల్లని తల్లి చల్లంగ కాపాడమ్మా.. అంటూ భక్తి పారవశ్యం చెందారు. మార్కెట్ ఏరియా, కాటూరు రోడ్డు, మసీదు సెంటరు, లక్ష్మీటాకీస్, సాయిమహల్, కొబ్బరితోట, సుందరంపేట, కాపుల రామాలయం సెంటర్లలో అమ్మవారి ఊరేగింపునకు భక్తజనం నీరాజనం పలికారు. బాణాసంచా కాల్చి భక్తులు సంబరాలు జరుపుకున్నారు. ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మకు చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గ్రామోత్సవం సజావుగా సాగేలా ఎస్‌ఐ ఎన్.వీరప్రసాద్ బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు.

వెల్లివిరిసిన సేవాభావం..

తిరునాళ్లలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు పట్టణంలో అడుగడుగునా సేవలు అందించారు. ప్రసాదాలు, అల్పాహారం, పాలు, మజ్జిగ పంపిణీ చేసి తల్లి సేవలో తరించారు. కాటూరు రోడ్డులో అమృత హోటల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో, బస్టాండు సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమంది ప్రసాదం, అల్పాహారం పంపిణీ చేశారు. పంపిణీ ప్రక్రియను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఉయ్యూరులో ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. చిన ఓగిరాల పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద పంపిణీ నిర్వహించారు.



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఘనంగా సత్యదేవుని సామూహిక వ్రతాలు



పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చిన సత్యదేవుడు

గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సత్యదేవుని సామూహిక వ్రతాలను వైభవంగా నిర్వహించారు. సామూహిక వ్రతాల్లో వందలాదిగా పాల్గొన్న దంపతులకు ఆలయం వారు ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాలను అందించారు. స్వామివారు వివిధ రకాల పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారికి వేద పండితులు విశేషాభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో హోమాల్ని వేద పండితులు చేపట్టారు. జిల్లాలోని నలుమూలల నుంచి తండోపతండాలుగా వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుడివాడ సత్యనారాయణ గుప్తా, ధర్మకర్తలు పాల్గొన్నారు.